# రెండు కథలు



## కల్తీ

అతను చాలా అసహనంగా వున్నాడు. తన భవిష్యత్ కార్యక్రమం నిర్ణయించుకోవడంలో కలిగిన వైఫల్యమే అతని అసహనానికి కారణం.

రెండ గంటల నుండి ఆ ఇరుకు గదిలో పచార్లు చేస్తున్నా, ఆ విశాల హృదయుడికి ఏ ఆలోచనా తట్టలేదు. ఆ ఉదయం జరిగిన ఇంటర్వ్యూ అయినా ఉద్యోగం సంపాదించి పెడుతుందని కోటి కలలు కన్నాడు. కానీ అందులో లక్షో వంతు కలలైనా కనకుండానే మరో కాసుల 'బాబు బాబు' ఆ ఉద్యోగాన్ని కొనుక్కున్నాడు. అతనొక నోరున్న మూగి, డబ్బులేని రోగి, నిర్భాగ్య నిరుద్యోగి. అందువలన అన్యాయాన్ని ప్రశ్నించ లేదు. ప్రశ్నించకుండా ఈ లోకంలో జీవించనూ లేదు. 'ఛీ...ఛీ... వెధవ దేశం అంతా కల్తీయే! న్యాయానికి అన్యాయం కల్తీ!' అనుకున్నాడు ఆ ఉద్యోగం ఇంకొకరు కొనుక్కున్నారని తెలిశాక అంతకు తప్ప ఇంకేం అనుకోలేదు.

తన పెళ్ళి కాని చెల్లి, కదలలేని తల్లి ఒక్కసారి అతని మనోఫలకం మీదకు వచ్చారు. అప్రయత్నంగా అతని కళ్ళలోంచి నీళ్ళు చిప్పిల్లాయి. క్రమక్రమంగా ఆ గదిని చీకటి ఆక్రమించుకొంటోంది. అతని మనసును అదెప్పుడో ఆక్రమించుకుంది.

అతనొక నిర్ణయానికొచ్చినట్టు గదికి తాళం వేసి బయలుదేరాడు. రోడ్డంతా వాహనాల కాలుష్యంతోనూ, జన సందోహంతోనూ నిండి వుంది. అతను షర్ట్ పాకెట్ చూసుకున్నాడు. ఏభై రూపాయిలకు పైగానే డబ్బులున్నాయి. తన తల్లి ఎన్ని గంటల శ్రమ ఫలితమో ఆ డబ్బు?

అతను తిన్నగా ఒక 'బార్'లోకి వెళ్ళాడు. అది చిన్న పాటి బార్.

బార్ నుండి బయటపడి ప్రక్కనున్న సందు గుండా 'మైన్' బజార్‌లోనికి ప్రవేశించాడు. ఒక ఇరుకు షాపులో తనకు కావలసింది కొనుక్కొని తన గది చేరుకున్నాడు.

పెన్ను, కాగితం తీసుకుని అతను వ్రాయాలను కొన్నది వ్రాశాడు. కాగితాన్ని మంచం ప్రక్కనున్న స్టూలుపై పెట్టి ఇందాక బజారు నుండి తెచ్చిన సీసాను చేతుల్లోకి తీసుకున్నాడు. ఎందుకోగానీ అతని చేతులు కొంచెం వణికాయి. 'పోయిజన్' అన్న ఎర్రని ఇంగ్లీషు అక్షరాలు పరిహసిస్తున్నట్టు మెరుస్తున్నాయి.

మరింకేం ఆలోచించలేదు. కప్పు తీసి రెండు గుక్కలేశాదు. ముందు చేదుగా అనిపించింది.

మహా అయితే మరో రెండు గంటలు... అంతే ఈ ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. ఈ ఆలోచన అతనికెంతో రిలీఫ్‌నిచ్చింది.

అతనలాగే పక్క మీద వాలి నిద్రపోయాడు.

* * *

బయట ఏదో చప్పుడు కావటంతో అతను మంచంపై నుండి లేచాడు.

కిటికీ నుండి ఎండ పడుతోంది సృష్టి ఇంకా అంతం కాలేదనటానికి సూచనగా! లుంగీ సర్దుకొని అతను మంచం పై నుండిలేచాడు.

ఎదురుగా స్టూలుపై గాలికి రెపరెపలాడుతూ కాగితం... గత రాత్రి అతను వ్రాసింది.

అంటే తాను చావలేదా? విషంలో కూడా కల్తీ వుంటుందా? స్టూలుపై నున్న కాగితం చేతుల్లోకి తీసుకున్నాడు. కొంచెంసేపు తదేకంగా చూసి ముక్కలు ముక్కలుగా దానిని చింపాడు. అప్పుడొచ్చాయి అతనికి కన్నీళ్ళు. నీరై, ఏరై– వరద కట్టను త్రెంచుకుని పారాయి.

'స్వతంత్ర దేశంలో చావు కూడా పెళ్ళిలాంటిదే బ్రదర్...' ఎక్కడో గ్రామఫోన్ రికార్డులో మంద్రంగా పాట వినిపిస్తోంది.

–ఎన్.రంగారావు

## వింత ఆచారాలు..




### గుడ్డ చిరిగితే విడాకులిచ్చే పద్ధతి!

ఆఫ్రికాలో గల ఫ్రెంచి సెనెగల్, పోర్చుగీసు గినియా దేశాల్లో ఒక వింత ఆచారం వుంది. ప్రపంచంలోనే ఇదొక ఎంతో వింతయిన ఆచారంగా చూడబడుతోంది. వివాహం జరిగేప్పుడు పెళ్ళికొడుకు పెళ్ళికూతురుకు ఓ వస్త్రాన్ని ఇస్తాడు. దానిని పెళ్ళికూతురు ఓ గౌనుగా కుట్టించుకుంటుంది. ఆ గౌను చిరగకుండా వున్నన్నాళ్ళు మాత్రమే ఆ పిల్ల అతడితో సంసారం చేయాలి. అది చిరుగు పట్టిందంటే, ఆమె అతడిని వదిలేయవచ్చును. ఆ మొగుడితో సంసారం తృప్తిగా వుంటే, ఆ గౌనును ఆమె తొడగనే తొడక్కుండా ఎంతో జాగ్రత్తగా దాచుకుంటూంటుందట. అలాక్కాక, అతడితో పొరపొచ్చాలు వుంటే త్వరగా తొడిగేసి చించేస్తుందట.

– బద్దిగం పాండురంగారెడ్డి

## మిగులు

జడ్జి అడిగాడు బోనులో వున్న వ్యక్తిని.

"తీర్పు వినేముందు నువ్వు కోర్టుకు సమర్పించుకొనేదేమైనా వుందా!"

"ఉన్న ఆస్తంతా ఈ కేసు గురించి లాయర్‌గారికే సమర్పించేసుకున్నానండి.. ఇంకేమి మిగలలేదండి' '

– కె.వి.